మీడియా పాయింట్

క్రిస్మస్ దుస్తుల పంపిణీకి 2 కోట్లు

- మైనార్టీ సదస్సుకు ఏర్పాట్లు: రామ్మోహన్‌రెడ్డి
- ఫార్మాసిటీ భూములు పేదలకే: మల్‌రెడ్డి రంగారెడ్డి
- అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యం: యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): క్రైస్తవులకు క్రిస్మస్ కానుకగా ప్రభుత్వం దుస్తులు పంపిణీ చేయనున్నదని, ఇందుకోసం రూ.2 కోట్ల వరకు ఖర్చు చేయనున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. గురువారం పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో మాట్లాడారు. త్వరలో ప్రభుత్వం మైనార్టీ స దస్సు నిర్వహించనున్నదని రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. త్వరలో ధరణి లోపాలను గుర్తించి సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు. ఇబ్రహీంపట్నంలో నిర్మించతలపెట్టిన ఫార్మాసిటీని మొదటి నుంచీ తాను వ్యతిరేకించానని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. తమ మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ఫార్మాసిటీ రద్దు చేసినందుకు రైతులు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల ప్రజల తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. దీనికోసం సేకరించిన భూములను స్థానిక పేద రైతులకు ఇస్తామని, దీనిపై ప్రభుత్వం తుది నిర్ణ యం తీసుకుంటుందని చెప్పారు. ఫార్మాసిటీ స్థానంలో కాలుష్య రహిత కంపెనీలను ఆహ్వానిస్తామని, స్థానికులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు ఇచ్చేవారికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ హయాంలోనే దళితులకు సముచిత స్థానం దక్కుతున్నదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా పాలన కొనసాగిస్తామని తెలిపారు.

రైతుబంధు ఐదు వేలేనా?

- 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు కదా!
- మ్యానిఫెస్టోలో ఎలాంటి నిబంధనలు లేవు కదా?
- రేవంత్ సర్కార్‌పై బీజేపీ ఎమ్మెల్యేల ధ్వజం
- గ్యారెంటీల అమలుకు యుద్ధం చేస్తామని వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలుకు నిబంధనలనే కొర్రీలు పెడుతున్నదని బీజేపీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసేందుకు వారితో నిత్యం యుద్ధం చేస్తామని ప్రకటించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో ఎకరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పిందని, కానీ ఇప్పుడు గత ప్రభుత్వం ఇచ్చినట్టు రూ.5వేలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మ్యానిఫెస్టోలో 5, 10 ఎకరాల లోపువారికి, అర్హులకు మాత్రమే రైతుబంధు ఇస్తామని ప్రకటించలేదు కదా అని నిలదీశారు. ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. మొదట దానిని అంబేద్కర్ భవన్ అన్నారని, ఆ తర్వాత దానిని ఫిర్యాదుల భవన్‌గా మార్చారని, మళ్లీ దానిని ఎస్సీ, ఎస్టీల స్టడీ సెంటర్‌గా, ఐఏఎస్ ఐపీఎస్‌లకు శిక్షణ ఇచ్చే కేంద్రంగా మార్చుతామని చెప్పారని, ఇప్పుడు డిప్యూటీ సీఎంకు కేటాయించడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు.

రూ.5 వేలు గత ప్రభుత్వమే ఇచ్చింది కదా..!

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే రూ.5 వేల రైతుబంధు ఇస్తా ఎలా? అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం కూడా రూ. 5 వేలు ఇచ్చింది కదా అని నిలదీశారు. రైతులకు ఒకేసారి రైతుబంధు ఇవ్వాలని అన్నారు. ఎన్నికల ప్రచారంలో రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారని, రెండు లక్షల రుణమాఫీని ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పారు. ఆ గ్యారెంటీలు అమలు చేసేందుకు వేల కోట్ల రూపాయలు కావాలని, అంత డబ్బును వారు ఇంటి నుంచి తీసుకొస్తారో? లేక కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నుంచి తీసుకొస్తారో? అని వ్యాఖ్యానించారు. మీడియా పాయింట్ వద్ద ఇంకా బీజేపీ ఎమ్మెల్యేలు కే వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, రామారావు పటేల్, పైడి రాకేశ్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడారు.

త్వరితగతిన ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- ప్రాజెక్టులకు అవసరమైన నిధులు విడుదల చేస్తాం
- నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై డిప్యూటీ సీఎం భట్టి సహా ఆరుగురు మంత్రుల సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్14 (నమస్తే తెలంగాణ): పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని, అందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని ఇరిగేషన్‌శాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులపై సచివాలయంలో గురువారం భట్టితోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు, కరీంనగర్ జిల్లాలో చిన్నకాళేశ్వరం ఇతర ప్రాజెక్టులు, నల్లగొండ జిల్లాలో ఎస్సెల్బీసీ టన్నెల్, డిండి, ఉదయసముద్రం, నక్కలగండి తదితర ప్రాజెక్టుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర వ్యాప్తంగా ఏకీకృత విధానాన్ని రూపొందించాలని, వృథా ఖర్చులను అరికట్టాలని సూచించారు. అనంతరం మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సెల్బీసీ, ఉదయసముద్రం, డిండి, సింగరాజుపల్లి, పెండ్లిపాకాల, గొట్టిముక్కుల రిజర్వాయర్, పిల్లాయిపల్లి కెనాల్, నెల్లికల్లు లిఫ్ట్ పనులను పూర్తి చేయాలని సూచించారు. అందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన నిధులను మంజూరు చేయిస్తామని చెప్పారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయనిగా రైతులు ఆశిస్తున్న సీతారామ ప్రాజెక్టు పనుల హెడ్ వర్క్స్‌కు, కాల్వల నిర్మాణానికి అయ్యే నిధులపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జైవీర్‌రెడ్డి, ఉత్తమ్ పద్మావతి, మందుల శామ్యూల్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, కుంభం అనిల్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొదలుపెట్టిన ప్రాజెక్టులు ఆపొద్దు: మండలి చైర్మన్ గుత్తా

సమీక్ష సమావేశానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరై ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలం కావాలంటే గత ప్రభుత్వం మొదలుపెట్టిన ప్రాజెక్టుల పనులు ఆపకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తగినంత బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు.

'మహాలక్ష్మి' నిధులపై భట్టి తొలి సంతకం

- రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి పెంపు ఫైలుపై రెండో సంతకం
- విద్యుత్తు సబ్సిడీలకు రూ.996 కోట్లు విడుదల
- మేడారం జాతర ఏర్పాట్లకు రూ.75 కోట్లు మంజూరు
- ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్తుశాఖల మంత్రిగా భట్టి విక్రమార్క పదవీ బాధ్యతల స్వీకరణ



గురువారం సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సబ్సిడీకి సంబంధించి రూ.374 కోట్లను ఆర్టీసీకి బదిలీచేస్తూ ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తొలి సంతకం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10 లక్షలకు పెంచగా, వైద్యారోగ్యశాఖకు రూ.298 కోట్లు విడుదలచేస్తూ రెండో సంతకం చేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం రెండో అంతస్థులో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్తుశాఖల మంత్రిగా విక్రమార్క గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆసియా ఖండంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సమ్మక్క-సారలమ్మ మేడారం జాతర ఏర్పాట్ల కోసం రూ.75 కోట్లు మంజూరు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రతిపాదనను ఆమోదిస్తూ మరో సంతకం చేశారు. విద్యుత్తు సబ్సిడీలకు రూ.996 కోట్లు విడుదలచేస్తూ ఇంకో సంతకం చేశారు.

త్వరలోనే ఆరు గ్యారెంటీల అమలు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా తొలుత రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే రెండు గ్యారెంటీలకు నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. త్వరలోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్, సంజీవరెడ్డి, బీ ఐలయ్య, మట్ట రాగమయి, మల్‌రెడ్డి రంగారెడ్డి, నాగరాజు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విద్యుత్తు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఆర్థిక శాఖ కార్యదర్శులు శ్రీదేవి, కృష్ణ భాస్కర్, హరిత.. భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భట్టి సతీమణి మల్లు నందిని విక్రమార్క, కుమారులు సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క దంపతులు గృహ ప్రవేశం చేశారు.

బుల్లెట్‌ప్రూఫ్ బాత్రూంలు, 150 గదులు ఉన్నాయా?

ఉత్తమ్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో ట్రోల్స్ • భట్టి సమాధానం చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): 'ప్రగతి భవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ బాత్రూమ్‌లు, 150 గదులు' అంటూ పీసీసీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. గతంలో కేసీఆర్ నివాసం ఉన్నప్పుడు.. ఆ భవనంపై ఉత్తమ్ అనేక ఆరోపణలు చేశారు. 'దేశంలో ప్రధాని నివాసం సహా ఏ ప్రజాప్రతినిధి అయినా లక్ష స్క్వేర్ ఫీట్ ఇంట్లో ఉంటున్నారా? రూ.500 కోట్లు విలువ చేసే భూమి మీద, రూ.60 కోట్ల ప్రజాధనంతో ఇల్లు కట్టుకున్నారా? బెడ్రూమ్, బాత్రూమ్ కూడా బుల్లెట్ ప్రూఫ్‌తో నిర్మించుకోవడం ఏంటి? అందులో 150 గదులు ఉన్నాయట కదా? దీనిపై కేసీఆర్ సమాధానం చెప్పాలి?' అంటూ మీడియా సాక్షిగానే ఉత్తమ్ వ్యాఖ్యలు చేశారు. అయితే, అదే భవన్‌ను ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కేటాయించారు. ఈ నేపథ్యంలో గతంలో ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలతో కూడిన వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అదే భవన్‌లో ఇప్పుడు భట్టి ఉంటున్నారు కాబట్టి ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలు విక్రమార్కకు కూడా వర్తిస్తాయని పేర్కొంటున్నారు. దీనిపై భట్టి స్పందించాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

నేడు ఉభయసభల సమావేశం

గవర్నర్ ప్రసంగం

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలి, శాసనసభ సంయుక్త సమావేశం శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కానున్నది. ఉభయలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగం ఉంటుంది. గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గవర్నర్ ప్రసంగంపై సుదీర్ఘంగా చర్చించింది. మంత్రివర్గం ఆమోదించిన ప్రభుత్వ ప్రాధాన్యతలను గవర్నర్ ఉభయ సభల ముందు ఉంచనున్నారు.

అసెంబ్లీకి కట్టుదిట్టమైన భద్రత

- సంపూర్ణ తనిఖీ అనంతరమే లోపలికి అనుమతి
- పార్లమెంట్ ఘటన నేపథ్యంలో సాధారణ పాస్‌ల నిలిపివేత

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఘటన నేపథ్యంలో అసెంబ్లీకి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోకి ఎవరినీ అనుమతించలేదు. సాధారణ సందర్శకుల పాస్‌లను నిలిపివేశారు. అసెంబ్లీ ప్రాంగణం, లాబీ, గ్యాలరీ, మీడియా పాయింట్ వద్ద కూడా పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిర్దేశిత పాస్‌లు ఉన్న వారిని కూడా గతంలో లాగా ఇబ్బడిముబ్బడిగా అనుమతించలేదు. మంత్రులు మినహా ఎమ్మెల్యేల వ్యక్తిగత సిబ్బందికి సైతం అసెంబ్లీ లాబీలోకి అనుమతి నిరాకరించారు.

- ఉత్తమ్ పదవీ బాధ్యతల స్వీకరణ

గురువారం సచివాలయంలో నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వైద్యారోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న దామోదర రాజనర్సింహ

'ఆరోగ్యశ్రీ' పెంపుపై తొలి సంతకం

వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖ మంత్రిగా దామోదర రాజనర్సింహ గురువారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచే ఫైల్‌పై తొలి సంతకం చేశారు. 5,300 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీపై రెండో సంతకం చేశారు. అనంతరం అసెంబ్లీకి వెళ్లారు. అక్కడ లాబీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. జర్నలిస్టులకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఈ అంశంపై ప్రత్యేక దృష్టిసారిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు కష్టం అవుతుందని చెప్పారు. దీనికి బదులుగా అపార్ట్‌మెంట్ల మాదిరిగా కట్టించి ఇవ్వాలని హౌసింగ్ సొసైటీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తే బాగుంటుందని సూచించారు.

- బాధ్యతలు స్వీకరించిన సీతక్క

గురువారం సచివాలయంలో పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న దనసరి అనసూయ (సీతక్క)

మాది ఇండస్ట్రీ ఫ్రెండ్లీ సర్కారు

- పరిశ్రమలు తరలుతున్నాయనే ప్రచారం జరుగొద్దు
- అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు



ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): తమది ఇండస్ట్రీ ఫ్రెండ్లీ సర్కారు అని, పారిశ్రామిక వర్గాల్లో ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా చూడాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. హైదరాబాద్ నుంచి పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నాయనే ప్రచారానికి ఆస్కారం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో శ్రీధర్‌బాబు మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పరిశ్రమ లశాఖ ముఖ్య కార్యదర్శితోపాటు టీఎస్ఐపాస్, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు. పరిశ్రమల శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాల గురించి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికరంగానికి అనుకూలంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు, సబ్సిడీలను యథావిధిగా కొనసాగిస్తుందని స్పష్టంచేసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. పారిశ్రామికరంగానికి నష్టం చేకూరేవిధంగా సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని, మీడియాకు లీకులు ఇవ్వరాదని సూచించినట్టు తెలిపారు.

యాదాద్రిలో స్పోర్ట్స్‌కాంప్లెక్స్

- రాయగిరిలో 10 ఎకరాల భూమి కేటాయింపు
- డీపీఆర్వోలకు అధునాతన కెమెరాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గురువారం సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రెండు ఫైళ్లపై తొలిసంతకాలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి పది ఎకరాల భూమిని కేటాయిస్తూ మొదటి సంతకం చేశారు. రూ.9.5 కోట్ల విలువైన భూమిలో మల్టిపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు యువజన, క్రీడల శాఖకు బదలాయించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల డీపీఆర్వోలకు అధునాతన కెమెరాలు అందజేసేలా సమాచార, పౌర సంబంధాల శాఖకు చెందిన ఫైల్‌పై మంత్రి తొలి సంతకం చేశారు. గృహ నిర్మాణ శాఖకు చెందిన పలు పరిపాలనా సంబంధిత ఫైళ్లపై సంతకాలు చేశారు. ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వేముల వీరేశం, ఆదినారాయణ, బాలునాయక్, ఆది శ్రీనివాస్, యశస్వినీరెడ్డితోపాటు సీనియర్ కాంగ్రెస్ నేతలు రేణుకా చౌదరి, రామసహాయం సురేందర్‌రెడ్డి తదితరులు మంత్రికి అభినందనలు తెలిపారు.

ప్రజలను చైతన్యం చేయాలి

బాధ్యతల స్వీకరణ అనంతరం మంత్రి పొంగులేటి సమాచార శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో సమాచారశాఖ కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్య వంతులను చేయడంలో సాంప్రదాయ ప్రచార మాధ్యమాలతోపాటు సోషల్ మీడియా వింగ్‌ను విస్తృతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. తెలంగాణ మాస పత్రికను మరింత ప్రామాణిక పత్రికగా తీర్చిదిద్దడంతో పాటు రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, ప్రజాప్రతినిధులకు, సామాన్య ప్రజలకు అందుబాటులో తేవాలని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, క్షేత్ర స్థాయిలో ప్రచార నిర్వహణపై దృష్టిపెట్టాలని సూచించారు. సమాచారశాఖ తోపాటు మీడియా అకాడమీ చేపట్టిన కార్యక్రమాలపై సమాచార కమిషనర్ అశోక్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి శ్రీనివాసరాజు, సమాచారశాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జేడీలు జగన్, శ్రీనివాస్, వెంకట రమణ, డీడీలు మధుసూదన్, హుష్మి, రాజారెడ్డి, సురేశ్, సీఐఈ రాధాకిషన్, ప్రాంతీయ సమాచార ఇంజినీర్ జయరామ్‌మూర్తి, రాములు, అకౌంట్స్ ఆఫీసర్ పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనాథనని నమ్మించి.. 7.55 లక్షలు టోకరా

'నీతో' యాప్ ద్వారా యువకుడి పరిచయం

సుబేదారి, డిసెంబర్ 14: 'నీతో' యాప్‌లో పరిచయమైన యువతిని ఓ వ్యక్తి మోసం చేశాడు. తాను అనాథనని నమ్మించి రూ.7.55 లక్షలు తీసుకొని మోసం చేశాడు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన యువతికి 'నీతో' యాప్ ద్వారా బంజారా హిల్స్‌కు చెందిన యువకుడు వెంపటి వసంత్ పరిచయమయ్యాడు. తనకు ఎవరూ లేరని, అనాథనని డబ్బులు అవసరం ఉన్నాయని చెప్పడంతో ఆమె నమ్మి, తన బ్యాంకు ఖాతా ద్వారా ఈ జూన్ నుంచి నవంబర్ 10 వరకు పలు దఫాలుగా రూ.7.55 లక్షలు వసంత్ ఖాతాకు బదిలీ చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బీసీ నేతకు పీసీసీ పగ్గాలు?

- పార్టీ నేత మార్పుపై కాంగ్రెస్ నేతల ఊహాగానాలు
- లోక్‌సభ ఎన్నికల తరువాతే మార్చే యోచనలో అధిష్ఠానం
- మరో ఆరు నెలల పాటు రేవంత్‌నే కొనసాగించే అవకాశం?

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): మొన్నటివరకూ ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠించడంతో రాష్ట్ర పార్టీ అధినేత మార్పుపై జోరుగా చర్చ జరుగుతున్నది. ఈసారి పీసీసీ చీఫ్‌గా ఎవరిని నియమిస్తారు? ఏ వర్గానికి ప్రాధాన్యమిస్తారు? అసలు మార్పు ఎప్పుడు జరుగుతుంది? అన్న దానిపై ఎవరికి వారు ఊహాగానాలు వినిపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే సాధారణంగా పార్టీ బాధ్యతలను ఒకరికి, ప్రభుత్వ బాధ్యతలను మరొకరికి అప్పగిస్తారు. ఈ క్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిని మార్చాలని అధిష్ఠానం కూడా ఆలోచిస్తున్నట్టు తెలిసింది. అయితే ఎప్పుడు మారుస్తారు అన్నదానిపై మాత్రం స్పష్టత రాలేదు. పీసీసీ అధ్యక్షుడి మార్పు ఎప్పుడు జరిగినా.. ఆ బాధ్యతలను బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు అప్పగించాలని పార్టీ అధిష్ఠానం ఆలోచిస్తున్నట్టు తెలిసింది. బీసీ సామాజిక వర్గానికి పీసీసీ అధ్యక్ష పదవి అప్పగించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమన్యాయం చేసిందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతకు ముఖ్యమంత్రి పదవి, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిన ఆ పార్టీ ఇప్పుడు బీసీ వర్గానికి చెందిన నేతకు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని యోచిస్తున్నట్టు తెలిసింది. కానీ తమకే పీసీసీ అధ్యక్ష పదవిని అప్పగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మరికొంత మంది కోరుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. సీఎం పదవి ఎవరికివ్వాలని ఇటీవల ఢిల్లీలో జరిగిన చర్చలో పాల్గొన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. సీఎం పదవిని రేవంత్‌రెడ్డికి ఇస్తే.. తనకు డిప్యూటీ సీఎంతో పాటు పీసీసీ అధ్యక్ష పదవి కూడా ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు తెలిసింది. అయితే దీనిపై ఆయనకు అధిష్ఠానం నుంచి ఏ మేరకు హామీ దక్కిందనేది ప్రశ్నార్థకమే. మరో ఆరు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్టీ బాధ్యతలను మరొకరి చేతిలో పెట్టేందుకు అధిష్ఠానం సాహసిస్తుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నేతృత్వంలోనే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలని అధిష్ఠానం యోచిస్తున్నట్టు సమాచారం. అదే నిజమైతే మరో ఆరు లేదా ఏడు నెలల వరకు పీసీసీ అధ్యక్షుడి మార్పు ఉండకపోవచ్చు.

చిట్టీల పేరుతో మహిళ కుచ్చుటోపీ

- దాదాపు రూ.6 కోట్లతో పరార్
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

కాజీపేట, డిసెంబర్ 14: తనను నమ్మి చిట్టీలు వేసుకున్న సభ్యులకు కుచ్చుటోపీ పెట్టి దాదాపు రూ.6 కోట్ల నగదుతో పరారైంది ఓ మహిళ. హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణంలోని ప్